నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

పోచారం: సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ప్రదీప్ కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోచారం, డాక్టర్స్‌కాలనీ, విజయ్ సాయి ఎన్‌క్లేవ్, సింగపూర్ టౌన్‌షిప్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఇన్ఫోసిస్ హాస్టల్స్, సెరీన్ హిల్స్, శివాలయం పరిసర ప్రాంతాలు, అన్నానగర్, నాగారం టూబీహెచ్‌కే, ఏవీ కన్‌స్ట్రక్షన్స్, అగాపే ఆర్ఫానేజ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

రేపు కీసరగుట్టలో తైబజార్ వేలం

కీసర: కీసరగుట్టలోని కీసర వాణి వద్ద ఈనెల 22న ఉదయం 10:30 గంటలకు తైబజార్ వేలం నిర్వహించనున్నట్లు దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ నాగమణి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కీసరగుట్ట బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈనెల 24 నుంచి మార్చి 1 వరకు కీసరగుట్టలో ఏర్పాటుచేసే దుకాణసముదాయాల నుంచి తైబజార్ ఫీజు వసూలు చేసేందుకు ఆసక్తి గల వారు కీసరవాణి వద్ద రుసుం రూ 1000 చెల్లించి దరఖాస్తు తీసుకోవాలని పేర్కొన్నారు. అలాగే దరావత్తుగా రూ 51,000 డీడీ తీసి వేలంలో పాల్గొనాలని తెలిపారు. ఇదిలాఉంటే వాహనాల పార్కింగ్ చేసేందుకు ఆన్‌లైన్ టెండర్ దాఖలుకు ఈనెల 21చివరి తేదీ అని పేర్కొన్నారు.

కీసర మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా సుమతి



నియామకపత్రం అందుకుంటున్న సుమతి

కీసర: మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా గోధుమకుంట ద్వారకామయి కాలనీచెందిన సుమతి నియామకమయ్యారు. ఈమేరకు రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతా రావు, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు లక్ష్మి చేతుల మీదుగా గురువారం నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా సునీతారావు మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా కాంగ్రెస్‌దే విజయమని ధీమా వ్యక్తం చేశారు.

ఐటీ దిగ్గజం విప్రోతో శ్రీనిధి ఒప్పందం



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న విప్రో సంస్థ, శ్రీనిధి కళాశాల ప్రతినిధులు

పోచారం: పాఠ్యాంశాలకు, వాస్తవ ప్రపంచ అనుభవాలకు మధ్య అంతరాన్ని తగ్గించేందుకు ఐటీ దిగ్గజం విప్రోతో యానంపేట్‌లోని శ్రీనిధి ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం ఇండస్ట్రీ ఇమ్మర్షన్ ప్రాజెక్టుపై గురువారం ఒప్పందం చేసుకున్నట్లు కళాశాల సీఈఓ అభిజిత్ రావు తెలిపారు. అధ్యాయనం లక్ష్యాలను ఆచరణాత్మకంగా సాధించడం, నూతన ఆవిష్కరణలు పెంపొందించడం, భిన్నమైన కెరియర్ ఎంపికచేసుకోవడం, నాయకత్వ నైపుణ్యాలు పెంపొందించుకోవడం, పరిశ్రమల గురించి విద్యార్థులకు అవగాహన కలిగించేందుకే ఒప్పందం చేసుకున్నామని తెలిపారు. దీనిద్వారా విద్యార్థులు సాంకేతిక రంగంలో రాణించేందుకు ఎంతో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో విప్రో ఒరాకిల్ డెలివరీ హెడ్ సుదీప్‌గుహ, గ్లోబల్ డెలివరీ హెడ్ కోటేశ్వరరావు, శ్రీనిధి కళాశాల సీఈఓ అభిజిత్ రావు తదితరులు పాల్గొన్నారు.

భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణం వేగవంతం

బోడుప్పల్: భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ మరింత వేగవంతం అవుతుందని భారతి సిమెంట్ సంస్థ టెక్నికల్ ఇంజినీరు బద్రి అన్నారు. బోడుప్పల్‌లోని శ్రీసాయి తిరుమల స్టీల్ స్పాట్ డీలర్ షాపులో గురువారం నిర్వహించిన తాపీ మేస్త్రీల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. భారతి సిమెంట్ అల్ట్రాపాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్ 5 స్టార్ గ్రేడ్ మార్కెట్‌లో విడుదల అయ్యిందన్నారు. ముఖ్యంగా స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారుల నిర్మాణానికి భారతి అల్ట్రాఫాస్ట్ సరైన ఎంపిక అన్నారు. అంతేగాకుండా వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం కూడా అందజేస్తామని పేర్కొన్నారు. స్లాబ్ కాంక్రీట్ సమయంలో నిపుణులైన తమ ఇంజినీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయ పడతారన్నారు. ఇతర సిమెంట్‌తో పోలిస్తే కేవలం రూ 20లు ఎక్కువ ధర ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీలరు రంగారెడ్డి, ప్రశాంత్, భారతి సిమెంట్ టెక్నికల్ టీం పాల్గొన్నారు.

కలగానే సొంతిల్లు!

కీసరలో నిలిచిన డబుల్ బెడ్రూం ఇళ్ల పనులు | రెండో విడతలో 24 రెండు పడక గదుల నిర్మాణం | త్వరగా పూర్తిచేయాలని నిరుపేదల విన్నపం



కీసరలో అసంపూర్తిగా ఉన్న డబుల్‌బెడ్రూం ఇళ్లు

కీసర: కీసరలో డబుల్ బెడ్రూం ఇండ్ల పనులకు గ్రహణం పట్టింది. దీంతో ఏండ్ల తరబడి సొంతింటి కోసం ఎదురుచూస్తున్న నిరుపేదల కల నెరవేరడం లేదు. వివరాల్లోకి వెళ్తే.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రెండు విడతల్లో రెండు పడకల గృహాల సముదాయాలను నిర్మాణం చేపట్టారు. మొదటి విడతలో కీసరలో 50, చీర్యాలలో 40, యాద్గార్‌పల్లి గ్రామంలో 40 ఇండ్లను నిర్మించి ఏడాదిన్నర క్రితం ఎన్నికల ముందు అప్పటి మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి హడావిడిగా లబ్ధిదారులకు అందజేశారు. రెండో విడతలో కీసరలో మరో 24 డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాలను శ్రీకారం చుట్టారు. ఆ పనులు దాదాపు 60 శాతం వరకు పూర్తయ్యాయి. తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇండ్ల నిర్మాణల కథ మొదటికొచ్చింది. ఇదిలాఉంటే మొదటి విడతలో లబ్ధిదారులకు ఇండ్లు కేటాయించినప్పటికీ ఇంటి మంజూరు పత్రాలు అందించలేదు. దీంతో ఇటీవల ఇండ్ల మంజూరు పత్రాలు పంపిణీ చేసేందుకు కీసరకు వచ్చిన ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి దృష్టికి స్థానికులు సమస్యను తీసుకెళ్లారు. నిలిచిన ఇండ్ల నిర్మాణాలు త్వరగా పూర్తిచేసి నిరుపేదలకు అందించాలని విన్నవించారు. అలాగే గతంలో అందజేసిన డబుల్‌బెడ్రూం ఇళ్లలో నెలకొన్న తాగునీరు, ప్రహరి, విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని లబ్ధిదారులు విన్నవించారు. ఇదిలాఉంటే దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని అహ్మద్‌గూడ గ్రామంలోని సర్వేనంబర్ 23లో సుమారు 20 ఎకరాల స్థలంలో జీ+10 విధానంలో సుమారు 4,428 డబుల్ బెడ్రూం ఇళ్లు, నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్-258లో గల 43 ఎకరాల్లో ఇన్ఫోసిస్‌కు సమీపంలో సుమారు 6 వేల డబుల్ బెడ్రూం ఇండ్లను లబ్ధిదారులకు గత ప్రభుత్వం కేటాయించింది. అయితే అక్కడ కూడా రవాణా సౌకర్యం, గృహ సముదాయాల వద్ద లిఫ్టులు ఏర్పాటు చేయకపోవడం, తాగునీటి సరఫరా లేకపోవడం, ఉపాధి అవకాశాలు లేని కారణంగా లబ్ధిదారులు ఇందులో నివసించేందుకు వెనకాడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి డబుల్‌బెడ్రూంల సముదాయాల్లో సౌకర్యాలు కల్పించడంతో పాటు, నిలిచిన ఇండ్ల నిర్మాణాల పనులు త్వరగా పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

లబ్ధిదారులకు త్వరగా అందించాలి..



కీసర గ్రామంలో నిలిచిపోయిన డబుల్‌బెడ్రూం ఇళ్ల పనులు వెంటనే పునఃప్రారంభించాలి. అధికారులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుని లబ్ధిదారులను అందించాలి. అలాగే మొదటివిడతలో అందించిన రెండ పడకల గృహాల సముదాయాల వద్ద సౌకర్యాలు కల్పించాలి.

– బండారి శ్రీనివాస్‌రెడ్డి, కీసర

సౌకర్యాలు కల్పించాలి..



నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లిలో నిర్మించిన డబుల్ బెడ్రూం గృహ సముదాయాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలి. జీప్లస్ 10 విధానంలో నిర్మించిన సుమారు 6 వేల ఇండ్లను గత ఎన్నికల ముందు అందజేశారు. అయితే వాటి సముదాయాల వద్ద లిఫ్టులు, తాగునీరు, రవాణా సౌకర్యం, అక్కడ నివసించేవారికి ఉపాధి అవకాశాలు లేవు. దీంతో లబ్ధిదారులు అక్కడ ఉండలేకపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి సౌకర్యాలు కల్పిస్తే లబ్ధిదారులు ఉండేందుకు ముందుకువస్తారు.

– కొంకట్ల చంద్రారెడ్డి
నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్

'హామీలు అమలు చేయాలి'



జీహెచ్ఎంసీ అధికారులు, రాంకీ సంస్థ ప్రతినిధులతో జేఏసీ నేతలు

కీసర: జవహర్‌నగర్ డంపింగ్‌యార్డు బాధితులకు జీహెచ్ఎంసీ, రాంకీ సంస్థ గతంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని జేఏసీ కన్వీనర్ డాక్టర్ శంకర్ నారాయణ, కో కన్వీనర్ ఏనుగు సంజీవరెడ్డి కోరారు. ఈమేరకు జేఏసీ నాయకులు జీహెచ్ఎంసీ అధికారులు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రాజెక్టు ఇన్‌చార్జి మనోజ్ అగర్వాల్, అడ్వైజర్ రామ్మోహన్‌రావు, పీటీఆర్ ప్రవీణ్‌ను గురువారం కలిసి చర్చించారు. డంపింగ్ యార్డు మురుగనీరు, దుమ్ము బయటకు రాకుండా చర్యలు తీసుకోవడంతో పాటు, డంపింగ్‌యార్డు బాధితులందరికీ ఉచితంగా తాగునీరు సరఫరా చేయాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. త్వరలోనే జీహెచ్ఎంసీ కమిషనర్‌తో చర్చలకు జేఏసీ నాయకులను ఆహ్వానించి సమస్యలు పరిష్కరించేలా కృషి చేస్తానని ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ శ్రీనివాస్‌రెడ్డి హామీనిచ్చినట్లు జేఏసీ నేతలు తెలిపారు. కలిసిన వారిలో నేతలు సమ్మిరెడ్డి, రామకృష్ణారెడ్డి, రవికుమార్‌రెడ్డి, గోగుల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టెక్ సంప్రతిలో ఎన్ఎన్ఆర్‌జీ విద్యార్థుల ప్రతిభ



బహుమతులు అందజేసిన మధుసూదన్‌రెడ్డి

పోచారం: చౌదరిగూడలోని నల్ల నర్సింహారెడ్డి విద్యాసంస్థల్లో జాతీయస్థాయిలో నిర్వహించిన టెక్, ఫార్మా సంప్రతి, తారా-2025 కార్యక్రమం గురువారం ముగిసింది. ముఖ్య అతిథిగా కిడ్స్ కింగ్డమ్ గ్రామర్ హైస్కూల్ కరస్పాండెంట్ కొండవీటి మధుసూదన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమయాన్ని సద్వినియోగం చేసుకుని నైపుణ్యాలు పెంపొందించుకోవాలన్నారు. అలాగే సంప్రతిలో పాల్గొని విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కళాశాల వైస్ చైర్మన్ నల్ల ప్రశాంత్‌రెడ్డి, డైరెక్టర్ సీవీ కృష్ణారెడ్డి, టెక్ సంప్రతి కన్వీనర్ డా. జీ.జనార్దన్‌రాజు, ఫార్మా సంప్రతి కన్వీనర్ ప్రొ. కృష్ణమోహన్ చిన్నాల, ట్రెనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కే.శ్రీకాంత్, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'అఖిల కుటుంబానికి న్యాయం చేయాలి'



బీజేపీ నాయకులతో మాట్లాడుతున్న పోలీసులు

మేడ్చల్: ఫీజుల వేధింపులతో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని అఖిల కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నాయకులు మేడ్చల్ శ్రీచైతన్య పాఠశాల ఎదుట గురువారం దీక్ష చేపట్టారు. బుధవారం బీజేపీ నాయకులు బాధిత కుటుంబ సభ్యులతో కలిసి పాఠశాలకు వెళ్లగా యాజమాన్యం నుంచి స్పందన లేకపోవడంతో స్కూల్ ఎదుట అఖిల కుటుంబానికి న్యాయం చేయాలని నినాదించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని నాయకులకు నచ్చజెప్పినా దీక్ష కొనసాగించారు. అఖిల తల్లిదండ్రులు వెంకటేశ్వర్లు, కమల, పట్టణ బీజేపీ నాయకులతో పాటు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

'ప్రజా సమస్యలు పట్టని ఎమ్మెల్యే, కార్పొరేటర్'



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

గౌతంనగర్: ప్రజా సమస్యలను స్థానిక ఎమ్మెల్యే, కార్పొరేటర్లు పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మోహన్‌రాజు అన్నారు. గౌతంనగర్‌కాలనీలోని తన నివాసంలో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గౌతంనగర్ కాలనీలో రోడ్ల మీదే చెత్త పేరుకుపోయి దోమల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే నెహ్రూనగర్‌లో పార్కులో చెత్త దుర్వాసనతో వాకింగ్ చేయలేకపోతున్నారని అయినా పట్టించుకోవడం లేదన్నారు. అలాగే మైనంపల్లి హన్మంతరావు ఏమి చేయలేదని కాలనీలో తిరుగుతూ వారు చేస్తున్న దుష్ప్రచారాన్ని ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పోచయ్య, శ్రీనివాసన్, లక్ష్మణ్, యాదగిరి, నరేశ్, రాజశేఖర్, దాస్, మణి, రాజు, చక్రవర్తి, విల్సన్, శ్రీధర్, మార్టిన్ తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసులో వ్యక్తి అరెస్ట్

పోచారం: రాంపల్లిలోని డబుల్ బెడ్రూం ఇళ్లలో సయ్యద్ అలీపై కత్తులతో దాడి చేసిన తన బావమరిది జాఫర్ అలీని పోచారం పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. సీఐ రాజు తెలిపిన ప్రకారం.. సయ్యద్ అలీపై తన బావమరిది జాఫర్ అలీ, మరో ముగ్గురు బుధవారం కత్తులతో దాడి చేశారు. ఇందులో అలీని అరెస్ట్ చేయగా, మిగిలిన ముగ్గురు పరారీలో ఉన్నారు.

బైక్‌ల అపహరణ

శామీర్‌పేట్: ఇంటి ఎదుట నిలిపిన రెండు ద్విచక్ర వాహనాలను అపహరించిన ఘటన జినోమ్ వ్యాలీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. లాల్‌గడిమలక్‌పేట్ గ్రామంలో ఉండే విరాళ నికేష బుధవారం రాత్రి తన ఇంటి ఎదుట బైక్ పార్క్ చేశాడు. మరుసటి రోజు తెల్లవారుజామున లేచి చూసేసరికి కనిపించలేదు. అలాగే అదే గ్రామానికి చెందిన నాగరాజు కూడా తన ఇంటి ముందు నిలిపిన బైక్ కనిపించలేదు. దీంతో బాధితులు జినోమ్ వ్యాలీ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు చోట్ల ఇద్దరి అదృశ్యం



భాస్కర్

జవహర్‌నగర్: వ్యక్తి అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు కథనం ప్రకారం.. జవహర్‌నగర్ శ్రీరామ్‌నగర్ కాలనీలో నివసించే భాస్కర్ (50), భార్య జయలక్ష్మి, కుటుంబసభ్యులతో కలిసి ఉంటున్నారు. కొంతకాలంగా బ్రెయిన్ స్ట్రోక్ వ్యాధితో బాధపడుతూ ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈనెల 20న దుకాణానికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో భాస్కర్ కోసం గాలించినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బాలుడి మిస్సింగ్



సమల్‌రాజు

జవహర్‌నగర్ బజరంగ్‌నగర్ కాలనీకి చెందిన ఆకుల రూతమ్మ కుమారుడు సమల్‌రాజు (14) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. ఈనెల 18న సమల్‌రాజు స్నేహితుడి ఇంటికి వెళ్తున్నానని, రూ.7 వేలు తీసుకుని సెల్‌ఫోన్ కొంటానని చెప్పి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో సమల్‌రాజు కోసం వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడోత్సవాలకు రండి

కీసర: మేడ్చల్ జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి తటాకం అభిలాష్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డిని గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాల సందర్భంగా కీసరగుట్టలో ఈనెల 24 నుంచి ప్రారంభకానున్న జిల్లాస్థాయి గ్రామీణ క్రీడోత్సవాలకు హాజరుకావాలని కోరుతూ ఆహ్వానపత్రికను అందజేశారు.



శివసేనారెడ్డికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న అభిలాష్ తదితరులు

తెలంగాణ ఉద్యమకారుల డిమాండ్లు నెరవేర్చాలి



పోస్టుకార్డు ఉద్యమం నిర్వహిస్తున్న నాయకులు

జవహర్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన ప్రకారం తెలంగాణ ఉద్యమకారుల డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జవహర్‌నగర్ అధ్యక్షుడు పిన్నోజు సుధాకర్‌చారి డిమాండ్ చేశారు. హామీలు అమలు చేయాలని కోరుతూ జవహర్‌నగర్‌లో సీఎం రేవంత్ రెడ్డికి ఉత్తరాలు రాసి పోస్టుకార్డు ఉద్యమాన్ని గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా సుధాకర్‌చారి మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 14 నెలలు గడుస్తున్నా ఉద్యమకారుల ఊసే ఎత్తడం లేదన్నారు. ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలంతో పాటు నాలుగు గదుల ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అనందాస్ ప్రకాశ్, కుటికంటి వెంకటేశ్, కుమ్మరి నర్సింహ, సత్యనారాయణ, ఆకుల నర్సయ్య, భాస్కర్, పరశురాం, ఎల్లస్వామి, సోమయ్య, మహేశ్, చంద్రశేఖర్, నర్సింహాయాదవ్, కృష్ణయాదవ్, నరేశ్‌యాదవ్, రమేశ్‌చారి, పుష్ప, మహేశ్వరి, మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రతాపసింగారంలో జాయింట్ సర్వే పూర్తి



భూముల సర్వే చేస్తున్న వివిధ శాఖల అధికారులు

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని ప్రతాపసింగారంలో రైతుల నుంచి ల్యాండ్ పూలింగ్ ద్వారా హెచ్ఎండీఏ భూములు సేకరించి అభివృద్ధి చేస్తోంది. ఆయా భూములకు సంబంధించిన జాయింట్ సర్వేను రెవెన్యూ, ఇరిగేషన్, హెచ్ఎండీఏ అధికారులు రైతుల సమక్షంలో గురువారం నిర్వహించారు. సర్వే ఆధారంగా ఇరిగేషన్ అధికారులు ఎన్‌ఓసీ జారీ చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియ ముగియగానే వెంచర్‌లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు టెండర్లు పిలుస్తారు. అధికారులు సర్వే నిర్వహించడంపై రైతులు మలిపెద్ది సుభాష్ రెడ్డి, పి.ఆంజనేయులు, పి.ధర్మారెడ్డి, వెంకట్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి, వంగూరి బాలయ్య తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ముగిసిన 'ద్రవ్యక-2025' సదస్సు



సదస్సు పుస్తకం విడుదల చేస్తున్న కళాశాల చైర్మన్ రవీందర్‌రెడ్డి తదితరులు

కీసర: చీర్యాలలోని గీతాంజలి ఫార్మసీ కళాశాలలో రెండురోజుల పాటు నిర్వహించిన 'ద్రవ్యక-2025' అంతర్జాతీయ సదస్సు గురువారం ముగిసింది. ఫార్మసీ ఆవిష్కరణ పరిశోధనలో ఇటీవల సాధించిన పురోగతులపై అవగాహన కల్పించారు. ఫార్మసిస్టు, రీసెర్చ్ స్కాలర్లు , శాస్త్రవేత్తలు, వివిధ కళాశాలల విద్యార్థుల్లో ఔషధ జ్ఞానాన్ని పెంపొందిచడమే ఈ సదస్సు ఉద్దేశమని కళాశాల చైర్మన్ జీ.ఆర్.రవీందర్‌రెడ్డి అన్నారు. ముఖ్యఅతిథిగా ఐఓఈ రీసెర్చ్ చైర్మన్ ప్రొఫెసర్ డా. డీ. బసవయ్య హాజరై మాట్లాడుతూ.. విద్యార్థులు పరిశోధనపై మరింత దృష్టి పెట్టాలన్నారు. సదస్సులో దేశ నలుమూలల కళాశాలలు, పరిశ్రమల నుంచి 374 మంది విద్యార్థులు పాల్గొన్నారు. 83 మౌఖిక ప్రదర్శనలు , 66 గోడ పత్రికలు ప్రదర్శించారు. అనంతరం విజేతలకు ధ్రువపత్రాలు, బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ డా. ఎం.రవికుమార్ ప్రొఫెసర్లు డా. ఐసాక్‌అనుకూరి, అథరవనాచారి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమికి హద్దులు ఏర్పాటు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న మాజీ కౌన్సిలర్ వెంకటేశ్ గౌడ్

పోచారం: అన్నోజిగూడలోని సర్వే నంబర్-14లోని ప్రభుత్వ భూమికి హద్దులు ఏర్పాటు చేయాలని మాజీ కౌన్సిలర్ బాలగోని వెంకటేశ్ గౌడ్ కోరారు. ఈమేరకు ఘట్‌కేసర్ తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 5 ఎకరాల 21 గుంటల ప్రభుత్వ భూమిని దివ్యాంగుల కాలనీ కోసం కేటాయించగా అందులో 2 ఎకరాల 21 గుంటల భూమి కబ్జాకు గురైందన్నారు. సర్వే నంబర్-14 చుట్టూ హద్దులు ఏర్పాటు చేయాలని గతంలోనే పలుమార్లు రెవెన్యూ అధికారులను కోరామని అయినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ భూమిని పరిరక్షించేందుకు రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు.

రైల్వే వంతెన పనులు త్వరగా పూర్తి చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ చైర్‌పర్సన్ పావనీజంగయ్య

ఘట్‌కేసర్: పట్టణంలోని రైల్వే వంతెన పనులు త్వరగా పూర్తి చేయించాలని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పావనీజంగయ్య, కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు ముత్యాలుయాదవ్ కోరారు. ఈమేరకు జిల్లా కలెక్టర్ గౌతమ్‌కు గురువారం వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 12 ఏళ్లుగా కొనసాగుతున్న వంతెన పనులతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే ఆర్టీసీ బస్సులు పట్టణంలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జంగయ్యయాదవ్, మాజీ కౌన్సిలర్ మల్లేశ్, కాంగ్రెస్ మున్సిపల్ ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యక్షుడు రాధాకృష్ణముదిరాజ్, నాగరాజ్ ముదిరాజ్, డీసీసీ కార్యదర్శి ఆంజనేయులుయాదవ్, శశిధర్, మైనార్టీ నాయకులు ఫరూక్, ఫయూమ్ పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో ప్రతిభ



అభినందిస్తున్న ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్

ఘట్‌కేసర్: తెలంగా రాష్ట్ర అథ్లెటిక్స్ యూత్ చాంపియన్‌షిప్‌లో అంకుసాపూర్‌లోని తెలంగాణ సాంఘిక గురుకుల మహిళా డిగ్రీ మహేంద్రహిల్స్ అథ్లెటిక్స్ క్రీడ అకాడమీ బాలికలు ప్రతిభ చూపారు. ఉమెన్స్ షాట్‌పుట్ విభాగంలో సరాల బుచ్చమ్మ బంగారు పతకం, డిస్కస్‌త్రోలో రేవతి బంగారు పతకం, (అండర్-20 విభాగం) షాట్‌పుట్‌లో కాంస్యం, డిస్కస్‌త్రోలో అనూష కాంస్యం, హైజంప్‌లో సత్య రజత పతకం సాధించింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ స్నేహలత, వైస్ ప్రిన్సిపాల్ స్వరూప, అథ్లెటిక్స్ కోచ్ భిక్షపతి అథ్లెటిక్స్‌ను గురువారం అభినందించి మెడల్స్ వేసి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, అథ్లెటిక్స్ పాల్గొన్నారు.

భోగ్ బండార్‌కు తరలిన చర్లపల్లి గిరిజన నేతలు



నివాళులర్పిస్తున్న గిరిజన నాయకులు

కుషాయిగూడ: సంత్ సేవాలాల్ జయంతిని పురస్కరించుకుని రవీంద్రభారతిలో సంత్ సాధువులు గురువారం నిర్వహించిన మహా భోగ్ బండార్ మహోత్సవానికి చర్లపలి డివిజన్ నుంచి గిరిజన నాయకులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. పూజలు, హోమంలో పాల్గొన్నారు. గిరిజన నాయకులు ఇస్లావత్ హరినాయక్, ధీరావత్ శ్రీనివాస్ నాయక్, భూక్యా భీమా నాయక్, మాలోత్ లచ్చానాయక్, హచ్యనాయక్, దశరథ్ నాయక్, లౌడియా సురేశ్‌నాయక్, హరియానాయక్, నరసింహ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నూతన ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

ఉప్పల్: ఉప్పల్ భగాయాత్‌లో సోమవంశ సహస్ర అర్జున క్షత్రీయసమాజ్ తెలంగాణ ప్రాంతీయ అధ్యక్షుడు రవీందర్ మాజీ ఐపీఎస్ విశ్వనాథ్, నాగరాజు ఆధ్వర్యంలో నూతనంగా 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. కాగా హబ్సిగూడ సూపరింటెండెంట్ ఇంజినీర్ బ్రహ్మం, డివిజనల్ ఇంజినీర్ సుబ్బారావు, అసిస్టెంట్ ఇంజినీర్ కిరణ్ కుమార్‌తో కలిసి గురువారం ప్రారంభించారు.

